ప్రజా శంఖారావం
PRAJA SHANKARAVAM
శనివారం
జూన్ 13, 2026
epaper.prajashankaravam.com
www.prajashankaravam.com

## ఇద్దరు చిన్నారులతో తండ్రి ఆత్మహత్య



**జుక్కల్, జూన్ 12,(ప్రజా శంఖారావం) :**

కామారెడ్డి జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. సంగారెడ్డి జిల్లా నిజాంపేటకు చెందిన కృష్ణ (32) తన కుమారుడు రక్షిత్ (9), కుమార్తె అనన్య (5)తో కలిసి నిజాంసాగర్ ప్రాజెక్టు వద్ద ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఈ ఘటన జరిగినట్లు ప్రాథమిక సమాచారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, గురువారం కృష్ణ ఇద్దరు పిల్లలతో కలిసి నిజాంసాగర్ ప్రాజెక్టు వద్దకు వచ్చాడు. రోజు మొత్తం వారితో అక్కడే గడిపి, అనంతరం భోజనం చేసిన తర్వాత సాయంత్రం సమయంలో ఇద్దరు చిన్నారులను నీటిలోకి తోసేసి తాను కూడా దూకినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని ఎన్డీఆర్ఎఫ్, అగ్నిమాపక సిబ్బందితో కలిసి గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం ఉదయం ఆరేడు శివారులోని 20 గేట్ల సమీపంలో ముగ్గురి మృతదేహాలను గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ముగ్గురి మృతదేహాలను చూసిన కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు అక్కడి వారిని కలిచివేశాయి.

## ప్రభుత్వ పాఠశాలలకు వెంటనే దుస్తులు అందించాలి



**కుత్బుల్లాపూర్, జూన్ 12 ( ప్రజా శంఖారావం ):**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఐ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాఠశాలలు ప్రారంభానికి ముందే విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. శుక్రవారం జగద్గిరిగుట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సీపీఐ బృందం సందర్శించి పరిస్థితిని పరిశీలించింది. మరో రెండు రోజుల్లో పాఠశాలలు ప్రారంభం కానున్నప్పటికీ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేయాల్సిన యూనిఫాంలు ఇంకా అందలేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడు లేకపోవడం, పారిశుద్ధ్య సమస్యలు కొనసాగుతున్నట్లు తమ పరిశీలనలో గుర్తించినట్లు తెలిపారు. వెంటనే విద్యార్థులకు యూనిఫాంలు పంపిణీ చేయడంతో పాటు ఖాళీగా ఉన్న బోధన సిబ్బంది పోస్టులను భర్తీ చేసి, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరిచే చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో శాఖ కార్యదర్శి ఎం. సహదేవరెడ్డి, ప్రజానాట్య మండలి అధ్యక్షుడు బాబు, సీపీఐ నాయకులు కృష్ణ, శ్రీనివాస్ చారి, యువజన నాయకులు కార్తీక్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

## డీసీఎం ఢీకొని వృద్ధుడి మృతి

**ఎల్లారెడ్డి, జూన్ 12 ( ప్రజా శంఖారావం ):**

ఎల్లారెడ్డి మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందగా, అతనితో పాటు ఉన్న 17 మేకలు కూడా ప్రాణాలు కోల్పోయాయి. ఈ ఘటన కొట్టాల్ గ్రామ సమీపంలోని ఎల్లారెడ్డి–కామారెడ్డి ప్రధాన రహదారిపై చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కొట్టాల్ గ్రామానికి చెందిన ఆలకుంట శివయ్య (74) మేకలను మేపేందుకు రహదారి వెంట వెళ్తుండగా కామారెడ్డి వైపు నుంచి ఎల్లారెడ్డి దిశగా వస్తున్న డీసీఎం వాహనం అతివేగంగా, నిర్లక్ష్యంగా నడపడంతో శివయ్యను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన తలకు, కాళ్లకు తీవ్ర గాయాలు కాగా వెంటనే ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శివయ్య మృతి చెందారు. ప్రమాదం సమయంలో శివయ్యతో ఉన్న 17 మేకలు కూడా అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. మృతుడి భార్య పోచవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు. శివయ్యకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు.

## మత్తు పదార్థాల అక్రమ రవాణాపై కఠిన చర్యలు

**భీంగల్, జూన్ 12 ( ప్రజా శంఖారావం):**

భీంగల్ మండలంలో గుడుంబా, గంజాయి తదితర మత్తు పదార్థాల విక్రయాలు, రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ వేణుమాధవ్ హెచ్చరించారు. ఆబ్కారీ శాఖ అధికారులతో కలిసి నిర్వహించిన ప్రత్యేక తనిఖీల సందర్భంగా ఆయన మాట్లాడారు. మత్తు పదార్థాల వల్ల యువత భవిష్యత్తు దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేసిన సీఐ, గుడుంబా, గంజాయి విక్రయించడం, రవాణా చేయడం లేదా వినియోగించడం వంటి చర్యలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారాన్ని అందించే వ్యక్తుల వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి తమ పరిసర ప్రాంతాల్లో మత్తు పదార్థాల విక్రయాలు లేదా వినియోగం జరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటనే డయల్–100 లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా పాఠశాలలు, కళాశాలల పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మత్తు పదార్థాలకు బానిసైన వారికి కౌన్సెలింగ్ నిర్వహించి, అవసరమైతే పునరావాస కేంద్రాలకు తరలించే చర్యలు కూడా చేపడతామని సీఐ వేణుమాధవ్ తెలిపారు. ఈ ప్రత్యేక తనిఖీల్లో ఎస్ఐలు, ఆబ్కారీ శాఖ అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# నర్సింగ్ కళాశాలలో భద్రతకు ప్రాధాన్యం

- **ఫెన్సింగ్ ఏర్పాటు చేసి పోలీసు పెట్రోలింగ్ పెంచాలి**
- **నిజామాబాద్ కలెక్టర్ ఇలా త్రిపాఠి**

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 12,(ప్రజా శంఖారావం) :**





మాక్లూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలను కలెక్టర్ ఇలా త్రిపాఠి సందర్శించి విద్యార్థినుల భద్రత, మౌలిక సదుపాయాలపై అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. కళాశాల ఆవరణలో ప్రహరీ లేకపోవడాన్ని గమనించిన ఆమె వెంటనే ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యార్థినుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, కళాశాల పరిసర ప్రాంతాల్లో పోలీసు పెట్రోలింగ్ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న భవనాల పనులను పరిశీలించిన కలెక్టర్, నాణ్యతను తనిఖీ చేసి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ విభాగం అధికారులకు సూచించారు. విద్యార్థినులకు అవసరమైన అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం తరగతి గదులను సందర్శించి విద్యార్థినులతో మాట్లాడారు. వారి అభ్యాస సామర్థ్యాన్ని తెలుసుకునేందుకు పలు ప్రశ్నలు అడిగి, వెంట తీసుకువచ్చిన డైరీలు, చాక్లెట్లు బహుమతిగా అందజేశారు. నర్సింగ్ కోర్సుకు ప్రస్తుతం మంచి డిమాండ్ ఉందని, ఏకాగ్రతతో చదివితే ఉద్యోగ అవకాశాలతో పాటు ఆకర్షణీయమైన వేతనాలతో ఉపాధి లభిస్తుందని కలెక్టర్ తెలిపారు. కరోనా సమయంలో పారా మెడికల్ సిబ్బంది అందించిన సేవలు ఆదర్శప్రాయమని కొనియాడారు. స్మార్ట్‌ఫోన్‌లు, సోషల్ మీడియాకు పరిమితంగా సమయం కేటాయించి, ఉన్నత భవిష్యత్తు కోసం లక్ష్యంతో ముందుకు సాగాలని విద్యార్థినులకు సూచించారు. తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టుకోవడంతో పాటు విద్యాసంస్థకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. వ్యక్తిగత భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా ధైర్యంగా అధికారులకు ఫిర్యాదు చేయాలని విద్యార్థినులకు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో సఖీ వన్ స్టాప్ సెంటను సంప్రదిస్తే గోప్యతతో పాటు అవసరమైన సహాయం అందుతుందని వివరించారు. బాలికల రక్షణ, ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని, బయటి వ్యక్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ కళాశాల ప్రాంగణంలోకి అనుమతించవద్దని నిర్వాహకులు, సిబ్బందిని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించే వారిపై ఉపేక్ష ఉండదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ శేఖర్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు అవగాహన కల్పించాలి

- **శాఖల సమన్వయంతో సమిష్టిగా చర్యలు చేపట్టాలి**
- **అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్**



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 12,(ప్రజా శంఖారావం) :**

రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులతో పాటు అన్ని వర్గాల ప్రజల్లో అందుబాటులో ఉన్న ప్రతి వేదిక ద్వారా రోడ్డు భద్రతపై చైతన్యం కల్పించాలని అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన రోడ్డు భద్రతా కమిటీ సమావేశానికి అదనపు కలెక్టర్ అధ్యక్షత వహించారు. సమావేశంలో పోలీసు, నేషనల్ హైవే అథారిటీ, ఆర్ అండ్ బీ, రవాణా శాఖ, ఆర్టీసీ, పంచాయతీరాజ్, విద్యుత్, వైద్యారోగ్య, మున్సిపల్ శాఖల అధికారులు, రోడ్డు భద్రతా కమిటీ సభ్యులు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు పాల్గొన్నారు. తరచుగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్న బ్లాక్‌స్పాట్ ప్రాంతాలు, వాటికి దారితీస్తున్న కారణాలపై సమీక్షించి నివారణ చర్యలపై చర్చించారు. ప్రమాదాల నివారణలో అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కిరణ్ కుమార్ సూచించారు. వరి కోతల సమయంలో రహదారులపై ధాన్యం ఆరబెట్టడం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని గణాంకాలు సూచిస్తున్నందున, రైతుల్లో దీనిపై ప్రత్యేక అవగాహన కల్పించాలని అన్నారు. అలాగే అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగాన్ని నిర్లక్ష్యం చేయడం వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులు, డ్రైవర్లు, ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని సూచించారు. బ్లాక్‌స్పాట్‌లుగా గుర్తించిన ప్రాంతాల్లో తక్షణమే అవసరమైన చర్యలు తీసుకుని ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రోడ్డు ప్రమాదం వెనుక ఉన్న కారణాలను సమగ్రంగా పరిశీలించి, అదే ప్రాంతంలో మళ్లీ అలాంటి ఘటనలు జరగకుండా శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రమాదాలకు కారణమవుతున్న రహదారి ఆక్రమణలను సంబంధిత శాఖలు సమన్వయంతో తొలగించాలని సూచించారు. పీఎం రహ్‌వీర్, పీఎం రాహత్ కార్యక్రమాలపై కూడా ప్రజల్లో అవగాహన పెంచాలని అన్నారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు, రోడ్డు భద్రతా కమిటీ సభ్యులు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## నూతన కోర్టు భవనానికి ఆటంకం లేకుండా చెట్ల కొమ్మల తొలగింపు

- **సొంత ఖర్చులతో పనులు చేపట్టిన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మల్లెల లక్ష్మణ్**

**భీంగల్, జూన్ 12 ( ప్రజా శంఖారావం ):**



భీంగల్ మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న నూతన కోర్టు భవనానికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా ఉండేందుకు చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపట్టారు. కోర్టు భవనానికి ఆనుకుని విస్తరించిన పెద్ద చెట్ల కొమ్మలను మిషనరీ సహాయంతో తొలగించారు. ఈ పనులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మల్లెల లక్ష్మణ్ సొంత ఖర్చులతో నిర్వహించారు. నూతన కోర్టు భవనం నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్న నేపథ్యంలో సమీపంలోని చెట్ల కొమ్మలు భవిష్యత్తులో ఇబ్బందులు కలిగించే అవకాశం ఉందని గుర్తించి ముందస్తు చర్యగా వాటిని తొలగించినట్లు మల్లెల లక్ష్మణ్ తెలిపారు. వర్షాకాలంలో బలమైన గాలులు, వర్షాల ప్రభావంతో కొమ్మలు విరిగి భవనంపై పడే ప్రమాదం ఉండటంతో పాటు నిర్మాణ పనులకు అంతరాయం కలగకుండా ఈ చర్యలు చేపట్టినట్లు వివరించారు. ప్రజలకు మెరుగైన న్యాయ సేవలు అందించే లక్ష్యంతో నిర్మిస్తున్న కోర్టు భవనం ఎలాంటి అవాంతరాలు లేకుండా పూర్తికావాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే భవనం పరిసర ప్రాంతం పరిశుభ్రంగా, సురక్షితంగా ఉండేందుకు కూడా ఈ చర్యలు ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు గజ్జెల చైతన్య, సురేష్, వాక మహేష్, చెప్పాల గణేష్, తోట సతీష్, అంజుమ్ అలీ, సంగ్యా నాయక్, పల్లె శేఖర్, ముచ్కూర్ లింబాద్రి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు జనార్ధన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పర్స అనంతరావు, జుబేర్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. నూతన కోర్టు భవనం నిర్మాణానికి సహకరిస్తున్న వారిని స్థానికులు అభినందించారు.

## ఎండు గంజాయితో వ్యక్తి అరెస్ట్



**భీంగల్, జూన్ 12 ( ప్రజా శంఖారావం ):**

భీంగల్ మండలంలోని సంతోష్‌నగర్ తండా సమీపంలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం నిర్వహించిన దాడుల్లో ఓ వ్యక్తిని అరెస్టు చేసి, అతని వద్ద నుంచి 100 గ్రాముల ఎండు గంజాయి, ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పీ వేణుమాధవరావు తెలిపారు. గంజాయి విక్రయాలు, వినియోగంపై అందిన సమాచారంతో అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గంజాయి సేవిస్తున్న మరో ముగ్గురు వ్యక్తులను గుర్తించి, వారి తల్లిదండ్రుల సమక్షంలో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. అనంతరం వారిని భీంగల్ తహసీల్దార్ ఎదుట హాజరుపర్చి బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ అధికారులు వెల్లడించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, గంజాయి వినియోగం ఆరోగ్యంతో పాటు భవిష్యత్తును కూడా నాశనం చేస్తుందని అధికారులు హెచ్చరించారు. ఎవరైనా గంజాయి విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే ఎక్సైజ్ శాఖకు తెలియజేయాలని కోరారు.

## ఇందల్వాయి నూతన ఎస్ఐ సుమలతకు సన్మానం



**ఇందల్వాయి, జూన్ 12,(ప్రజా శంఖారావం) :**

ఇందల్వాయి మండల నూతన సబ్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సుమలతను మండల బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో శాలువా కప్పి, పూలమాలలతో శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలో శాంతిభద్రతల పరిస్థితిపై ఎస్ఐ సుమలతతో నాయకులు చర్చించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమర్థవంతమైన పోలీసింగ్ కొనసాగించాలని కోరారు. శాంతిభద్రతల పరిరక్షణలో మండల ప్రజలు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకుల తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ ఇన్‌చార్జి అధ్యక్షుడు శ్రీనివాస్ జెల్లెల్ల, జిల్లా నాయకులు నాయిడి రాజన్న, తన్నీరు శ్రీనివాస్, సర్పంచులు కన్నె రాజేందర్, జగత్ సింగ్, ఉప సర్పంచులు శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్ చారి, మండల స్థాయి నాయకులు మోహన్ రెడ్డి, గంగారాం, సక్కి లక్ష్మీనారాయణ, అశోక్, మహేష్, శ్రీనివాస్ రెడ్డి, మనోహర్, భాస్కర్, మహేందర్, నడిపి రాజుతో పాటు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## గాంధీ మెడికల్ కళాశాల సూపరింటెండెంట్‌ను కలిసిన డాక్టర్ నాగమోహన్

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 12,(ప్రజా శంఖారావం) :**



గాంధీ మెడికల్ కళాశాల ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ నాగమోహన్ కళాశాల సూపరింటెండెంట్ డాక్టర్ వాణిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విభాగానికి సంబంధించిన పలు అంశాలపై ఇరువురు చర్చించారు. ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగం అభివృద్ధి, విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించే చర్యలు, మెడికో–లీగల్ సేవల మెరుగుదలతో పాటు భవిష్యత్ కార్యాచరణపై అభిప్రాయాలు పంచుకున్నారు. విభాగాన్ని మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కూడా చర్చించినట్లు సమాచారం.

# కిశోర బాలికల ప్రతిభకు కలెక్టర్ అభినందన

**కామారెడ్డి, జూన్ 12 (ప్రజా శంఖారావం):**



రాష్ట్ర స్థాయి స్నేహ మాక్ పార్లమెంట్‌లో ప్రతిభ కనబరిచిన కామారెడ్డి జిల్లా కిశోర బాలికలను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ శుక్రవారం సన్మానించారు. ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్–డీఆర్‌డీఏ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్నేహ కిశోర బాలికల సమ్మర్ క్యాంప్‌లో భాగంగా ఈ నెల 10, 11 తేదీలలో హైదరాబాద్ పాత అసెంబ్లీ భవనంలో రాష్ట్ర స్థాయి మాక్ పార్లమెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట మండలానికి చెందిన రేఖ, దోమకొండ మండలానికి చెందిన సమంత, భిక్నూర్ మండలానికి చెందిన నైతిని, మాచారెడ్డి మండలానికి చెందిన నవ్యశ్రీ పాల్గొన్నారు. నవ్యశ్రీ సోషల్ జస్టిస్ మంత్రిగా వ్యవహరించగా, మిగిలిన బాలికలు పార్లమెంట్ సభ్యులుగా చర్చల్లో పాల్గొన్నారు. రేఖ దివ్యాంగులకు అన్ని రంగాల్లో రిజర్వేషన్ల అవసరాన్ని, నైతిని మద్యపాన నిషేధాన్ని, సమంత బాల్య వివాహాల నిర్మూలనతో పాటు బాలికల విద్యాభివృద్ధి అంశాలను ప్రస్తావిస్తూ తమ అభిప్రాయాలను సమర్థవంతంగా వ్యక్తం చేశారు. బాలికల వాదన నైపుణ్యం, అంశాలపై అవగాహనకు ఆకర్షితులైన రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, మహిళా–శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం రాష్ట్ర స్థాయి మాక్ పార్లమెంట్‌లో పాల్గొన్న బాలికలను కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సన్మానించి నోట్‌బుక్స్‌ను బహుమతిగా అందజేశారు. బాలికల తల్లిదండ్రులను కూడా అభినందించారు. సామాజిక అంశాలపై అవగాహన పెంపొందించుకుని నాయకత్వ లక్షణాలను అభివృద్ధి చేసుకోవడంలో ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గిరి, డీఆర్‌డీఓ దామోదర్ రెడ్డి, అదనపు డీఆర్‌డీఓ విజయలక్ష్మి , డీపీఎంలు, ఏపీఎంలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**కళాశాల పనులపై రాజీ వద్దు**

జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో జరుగుతున్న మైనర్ రిపేర్ పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆదేశించారు. శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పంచాయతీ రాజ్ ఇంజనీర్లకు పనుల నాణ్యతలో రాజీ పడకుండా గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి షేక్ సలాం ప్రతిరోజూ కళాశాలలను సందర్శించి పనుల పురోగతిని పర్యవేక్షించాలని ఆదేశించారు. సమావేశంలో బాన్సువాడ డివిజన్ పంచాయతీ రాజ్ ఇంజనీర్ అంజయ్య, కామారెడ్డి డివిజన్ పంచాయతీ రాజ్ ఇంజనీర్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## యూరియా బుకింగ్ యాప్‌ను రద్దు చేయాలి



**ఇందల్వాయి, జూన్ 12 (ప్రజా శంఖారావం):**

రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం అమల్లో ఉన్న యూరియా బుకింగ్ యాప్‌ను తక్షణమే రద్దు చేయాలని ఇందల్వాయి మండల బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఆన్‌లైన్ యాప్ విధానం కారణంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన సామాన్య రైతులు యూరియా పొందడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యాప్ విధానాన్ని రద్దు చేసి గతంలో మాదిరిగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, స్థానిక ఎరువుల దుకాణాల ద్వారా యూరియాను రైతులకు అందుబాటులో ఉంచాలని కోరారు. అలాగే ఎకరానికి ఎంత మేర యూరియా కేటాయిస్తున్నారనే అంశంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువుల పంపిణీ వ్యవస్థను సులభతరం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ ఇన్‌చార్జి అధ్యక్షుడు శ్రీనివాస్ జెల్లెల్ల, జిల్లా నాయకులు నాయిడి రాజన్న, తన్నీరు శ్రీనివాస్, సర్పంచులు కన్నె రాజేందర్, జగత్ సింగ్, ఉప సర్పంచులు శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్ చారి, మండల స్థాయి నాయకులు మోహన్ రెడ్డి, గంగారాం, అశోక్, మహేష్, శ్రీనివాస్ రెడ్డి, మనోహర్, భాస్కర్, మహేందర్, నడిపి రాజుతో పాటు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## చివరిచూపు కోసం ఎదురుచూపులు

**చేగుంట జూన్ 12 (ప్రజా శంఖారావం):**



మెదక్ జిల్లా, చేగుంట మండలం, బతుకుతెరువు కోసం దుబాయ్ కి వెళ్లి గుండె పోటుతో మరణించాడు, కుటుంబీకులు చివరి చూపు కోసం ఎదురుచూస్తూ ప్రభుత్వం తమను ఆదుకోవాలని కన్నీరు మున్నీరుగా వేడుకుంటున్నారు, వివరాలకు వెళితే చేగుంట మండలం వడియారం గ్రామానికి చెందిన చింతకింది సాయికిరణ్(35) ఉపాధి కోసం గతేడాది దుబాయ్ వెళ్లగా.. ఈ నెల 2న విధుల్లో ఉండగానే గుండెపో టుతో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు, తల్లిదండ్రులు ఉన్నారు. చివరి చూపు కోసం ఎదురుచూస్తూ, మృతదేహాన్ని స్వగ్రామానికి రప్పించేలా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ చూపి తమ కుటుంబానికి సహాయం అందించాలని బాధిత కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా వేడుకుంటున్నారు.


## మీనాక్షి నామినేషన్ తిరస్కరణ శోచనీయం

**కామారెడ్డి, జూన్ 12 (ప్రజా శంఖారావం):**



తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్‌ను సాంకేతిక కారణాలతో తిరస్కరించడం శోచనీయమని జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అంకన్నగారి నాగరాజ్ గౌడ్ అన్నారు. బీజేపీ ఫిర్యాదు చేసిన వెంటనే నామినేషన్‌ను తిరస్కరించడం కుట్రపూరిత రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు. మహిళా నాయకురాలిని రాజ్యసభకు వెళ్లకుండా అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ఈ వ్యవహారం సుప్రీంకోర్టు విచారణలో ఉన్నందున న్యాయవ్యవస్థపై పూర్తి నమ్మకం ఉందని, చివరకు న్యాయమే గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## రైతులకు సకాలంలో ఎరువులు అందించాలి



**నిజామాబాద్ రూరల్ సిరికొండ, జూన్ 12 (ప్రజా శంఖారావం):**

సిరికొండ మండలంలో రైతులు ఎదుర్కొంటున్న యూరియా కొరత సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో మండల తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమానికి కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు చౌటుపల్లి ప్రభాకర్ నాయకత్వం వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం వానాకాలం వ్యవసాయ పనులు ఊపందుకున్న నేపథ్యంలో రైతులకు యూరియా అత్యవసరంగా అవసరమవుతోందని తెలిపారు. అయితే ఆన్‌లైన్ బుకింగ్ విధానంలో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యాప్‌లో బుకింగ్ చేసుకున్నప్పటికీ ఎరువులు సకాలంలో అందక రైతులు పలుమార్లు సొసైటీలు, ఎరువుల దుకాణాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొందని అన్నారు. వ్యవసాయ సీజన్ కీలక దశలో ఉండటంతో యూరియా కొరత రైతులపై అదనపు భారం మోపుతోందని, ప్రభుత్వం వెంటనే తగిన చర్యలు తీసుకుని సరిపడా నిల్వలు అందుబాటులో ఉంచాలని కోరారు. అలాగే యూరియా పంపిణీ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి, స్థానిక సహకార సంఘాలు, ఎరువుల విక్రయ కేంద్రాల ద్వారా రైతులకు సులభంగా అందేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.రైతుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తక్షణ పరిష్కారం చూపించాలని తహసీల్దార్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కిసాన్ మోర్చా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## బాల కార్మిక నిర్మూలనకు సమష్టిగా కృషి చేయాలి

**చేగుంట, జూన్ 12 (ప్రజా శంఖారావం):**



మెదక్ జిల్లా, చేగుంట మండలం, ఇబ్రహీంపూర్ గ్రామంలో.ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విజన్ ఎన్‌జీఓ ఆధ్వర్యంలో ఇబ్రహీంపూర్ గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, పిల్లల హక్కుల పరిరక్షణ, విద్య యొక్క ప్రాముఖ్యతపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విజన్ ఎన్‌జీఓ జిల్లా కోఆర్డినేటర్ రాజు మాట్లాడుతూ, బాల కార్మిక వ్యవస్థ సమాజ అభివృద్ధికి అడ్డంకిగా మారుతుందని, ప్రతి బాలుడు విద్యను అభ్యసించే హక్కు కలిగి ఉన్నాడని పేర్కొన్నారు. సి.ఎస్.ఎం యాదగిరి, సంజీవ్ బాలల సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి మాధవి మాట్లాడుతూ, బాల కార్మికులను గుర్తించిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. గ్రామ ఉప సర్పంచ్ చౌదరి శ్రీనివాస్ మాట్లాడుతూ, గ్రామంలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రజలందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో.విజన్. ఎన్జీవో డిస్ట్రిక్ట్.కో . ఆర్డినేటర్ కె.రాజు, గ్రామ సర్పంచ్ జ్యోతి, ఉప సర్పంచ్. సిహెచ్ . శ్రీనివాస్, గ్రామకార్యదర్శి మాధవి మరియు.విజన్.సిబ్బంది సంజీవ్, యాదగిరి వార్డు సభ్యులు రాజు,నవీన్,రమ్య రాజు.అంగన్వాడీ టీచర్స్ బుజమ్మ, బాలక్ష్మి , ఆశ వర్కర్ రాజవ్వ, స్కూల్ టీచర్ సయ్యద్,పెద్దలు, యువకులు, మహిళలు, విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించాలి

- మెదక్ టౌన్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు

**మెదక్, జూన్ 12 (ప్రజా శంఖారావం):**



మెదక్ జిల్లా వ్యాప్తంగా పోలీసు స్టేషన్ల పనితీరును సమీక్షిస్తున్న జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు శుక్రవారం మెదక్ టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో నిర్వహిస్తున్న రికార్డులు, పెండింగ్ కేసులు, నేర నియంత్రణ చర్యలు, సిబ్బంది విధి నిర్వహణను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. కేసుల విచారణలో నిర్లక్ష్యానికి తావివ్వకుండా సమయపాలనతో విధులు నిర్వహించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చేపడుతున్న చర్యలను సమీక్షించిన ఎస్పీ, ట్రాఫిక్ నియంత్రణతో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను నిరంతరం నిర్వహించాలని సూచించారు. వాహనదారుల్లో అవగాహన పెంచడంతో పాటు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించిన ఆయన, ముఖ్య కూడళ్లు, వ్యాపార ప్రాంతాలు, ప్రమాదకర ప్రాంతాల్లో కెమెరాలు ఎప్పటికప్పుడు పనిచేసేలా చూడాలని సూచించారు. నిఘా వ్యవస్థను బలోపేతం చేసి నేర నియంత్రణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించాలని అన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల ఫిర్యాదులను సక్రమంగా నమోదు చేసి వారికి అవసరమైన సహాయం అందించాలని, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఎస్పీ సూచించారు. అనంతరం పోలీసు సిబ్బందితో సమావేశమై విధి నిర్వహణలో క్రమశిక్షణ పాటించాలని, ప్రజల ఫిర్యాదుల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని, శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించడమే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ తనిఖీలో మెదక్ టౌన్ సీఐ మహేష్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ సందీప్ రెడ్డి, ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ట్రోలింగ్‌ను సహించం.. చర్యలు తీసుకోవాలి



**కామారెడ్డి, జూన్ 12 (ప్రజా శంఖారావం):**

తనపై సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న అసభ్యకర ట్రోలింగ్ వెనుక కాంగ్రెస్ సీనియర్ నేత షబ్బీర్ అలీ ఉన్నారని కామారెడ్డి మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం సుమారు 30 మంది మహిళలతో కలిసి జిల్లా ఎస్పీ రాజేష్ చంద్రకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, షబ్బీర్ అలీ కుటుంబ సభ్యులు, అనుచరులు తనను లక్ష్యంగా చేసుకుని అసభ్య పదజాలంతో ట్రోల్ చేస్తున్నారని ఆరోపించారు. సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న తనను రాజకీయంగా దెబ్బతీయాలనే ఉద్దేశంతో ఈ చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలు, యువత ప్రజాసేవలో ముందుకు రావాలని ప్రోత్సహిస్తుంటే, కొందరు నాయకులు మాత్రం మహిళలను అవమానించే విధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. జీసీఆర్ ట్రస్ట్ ద్వారా పేదలకు, వృద్ధులకు, మహిళలకు సహాయ కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని తెలిపారు. కామారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ బలహీనపడటానికి షబ్బీర్ అలీ కారణమని ఆరోపించిన ఇందుప్రియ.. తనపై జరుగుతున్న ట్రోలింగ్‌పై సమగ్ర దర్యాప్తు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయం జరగకపోతే రాష్ట్ర మహిళా కమిషన్, పార్టీ క్రమశిక్షణ కమిటీకి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

## కాకతీయ నగర్‌లో డ్రైనేజీల పూడికతీత పనుల ప్రారంభం



**కామారెడ్డి, జూన్ 12 (ప్రజా శంఖారావం):**

గత ఏడాది భారీ వర్షాల సమయంలో పట్టణంలోని రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయమై ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈసారి ముందస్తు చర్యలకు కామారెడ్డి మున్సిపాలిటీ శ్రీకారం చుట్టింది. మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం 14వ వార్డు కాకతీయనగర్ కాలనీలోని లోతట్టు ప్రాంతాల్లో డ్రైనేజీల పూడికతీత, చెత్తాచెదారం తొలగింపు పనులను జేసీబీలతో ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ, ప్రజల భద్రత, సౌకర్యమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని పేర్కొన్నారు. వర్షపు నీరు ఎక్కడా నిల్వ ఉండకుండా, డ్రైనేజీలు సాఫీగా ప్రవహించేలా పట్టణంలోని వివిధ వార్డుల్లో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో పనులు చేపడుతున్నామని తెలిపారు. ఇందుకోసం రూ.2.70 కోట్ల వ్యయంతో అభివృద్ధి, మౌలిక సదుపాయాల పనులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో ఉండి పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నారని, వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రాంశెట్టి హర్షిత, అంజాద్, గణేష్, రామ్మోహన్, నిట్టు గంగాధర్, మోతీలాల్, మున్సిపల్ కమిషనర్ పర్వతాలు, డీఈ హన్మంతరావు, భూపతి, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## జీకే తండాలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం



**ఇందల్వాయి, జూన్ 12 (ప్రజా శంఖారావం):**

ఇందల్వాయి మండల పరిధిలోని జీకే తండా గ్రామ పంచాయతీలో నూతనంగా మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం ప్రారంభించారు. ఉపాధి హామీ పథకం (ఎన్‌ఆర్‌ఈజీఎస్) నిధుల కింద రూ.15 లక్షల వ్యయంతో ఈ పనులు చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ సర్పంచ్ లౌడియ శిరీష మహిపాల్ నాయక్ కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. తండాలో ఎన్నో రోజులుగా ఉన్న రహదారి సమస్య పరిష్కారానికి నిధులు మంజూరు కావడం సంతోషకరమని పేర్కొంటూ, ఇందుకు సహకరించిన ప్రజాప్రతినిధులకు గ్రామ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రజల సహకారంతో తండా అభివృద్ధికి మరిన్ని కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దేగావత్ రజిత సుధాకర్, వార్డు సభ్యులు భూక్యా మోహన్, బదవత్ మహిపాల్‌తో పాటు మహిళలు, యువకులు, గ్రామ పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

